# బురఖా

**వసుంధర**



**స్వప్న నాకంటే రెండేళ్లు చిన్నది. నాకంటే షోగ్గా ఉంటుంది. ఉంటే నాకేమంటారా - మరామె మా వారి ఆఫీసులో కొత్తగా చేరింది. ఆయనకీ ఆమెకీ అఫైర్ నడుస్తోందని నాకో ఆకాశరామన్న ఫోన్‌కాల్ వచ్చింది.**

ఇలాంటి విషయాల్లో నేను చాలా ఫ్రాంక్. ఆ సాయంత్రమే ఆయన్నడిగాను.

"చేసింది రామన్నా, రామమ్మా?" అడిగారయన వెంటనే.

"రామమ్మే?" అన్నాను గొంతు గుర్తు చేసుకుని.

"ఐతే ఆ రామమ్మ అసలు పేరు వసంత. నా కోసం ట్రై చేసి చేసి– పడలేదన్న అక్కసుతో నీకా ఫోన్ చేసింది" అన్నారు మావారు.

నిజమనుకున్నాను. కానీ రెండ్రోజుల తర్వాత ఆయనకీ స్వప్నకీ నడుస్తున్న అఫైర్ గురించి మరో ఫోన్ వచ్చింది. ఈ సారి చేసింది రామన్న. ఆయనకి చెబితే, " ఆ వసంతకో గంతకి తగ్గ బొంతతో అఫైరుందిలే. వాడిచేత చేయించి ఉంటుంది" అన్నారు తడుముకోకుండా. ఆయన రెడీనెస్‌లో - ఔటైన క్వెశ్చన్ పేపర్ ఆన్సర్ చేసే ఎంసెట్ విద్యార్థి ఈజ్ కనిపించింది.

రంకు నేర్చినయ్య బొంకు నేర్వడా అన్న అనుమానం నాకప్పుడు కలిగింది. ఆ వెంటనే నా క్లోజ్ ఫ్రెండ్ పరిణతి గుర్తొచ్చింది.

మావారెంత అందగాడంటే – నా పెళ్లికిముందు నా సర్కిల్లో ఆయనో టాకింగ్ పాయింట్.

కాలేజి రోజుల్లో ఆయనకి రోజుకో ప్రేమలేఖట. వెంటబడ్డ అమ్మాయిలకి లెక్కే లేదుట. నాతో పెళ్లి కుదిరిందని తెలిసి కనీసం పదిమంది అమ్మాయిల గుండెలు బద్దలైపోయాయిట. పెళ్లికిముందు – మాటలతో డేటింగ్ రోజుల్లో – ఆయనే ఇవన్నీ నాకు చెప్పారు. నా ఫ్రెండ్సంతా "నమ్మొచ్చు" అన్నారు. పరిణతి మాత్రం "ఇదంతా ఇమేజ్ బిల్డింగ్ తాపత్రయంలా ఉంది" అని కొట్టిపారేసి, "అందం ఆడదానికి మాత్రమే అసెట్. ఆడది మగాడి అందానికి పడిపోతుందన్న మిత్ – ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సున్న మగాళ్లు సృష్టించినది" అనేసింది.

నా వరకూ వస్తే – పెళ్లిచూపుల్లో వరుడి అందంకంటే హోదాకే ప్రాధాన్యం ఇచ్చాను. ఐతే మావారు అందగాడని గర్వమూ పడ్డాను. పరిణతి మాటల్లో నిజమెంతో తేల్చడమెలా?

పరిణతి అప్పటికి రెణ్ణెల్ల క్రితమే పెళ్లయింది. వాళ్లాయన కిషన్– అంత బాగుండడు. అందుకే అలాగందని మిగతావాళ్లంటే అప్పుడు నేనూ ఔననుకున్నాను. ఆ తర్వాత రెండేళ్లకి..

ఇప్పుడు పరిణతి హైదరాబాదులోనే మాకు ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉంటోంది. కలుసుకునేందుకు కార్లో వెళ్లొచ్చు. కానీ హైదరాబాదులో కారు – కర్ణుడి అస్త్రంలాంటిది. ట్రాఫిక్ జాం –కర్ణుడికి శాపంలాంటిది. అందుకని పరిణతికి ఫోన్ చేసి మావారి లీలలు చెప్పి, "నువ్వన్నది నిజమేనే! భర్తా రూపవంతా శత్రు:" అన్నాను.

పరిణతి నవ్వి, "నేనన్నది నువ్వు మరోలా అర్థం చేసుకున్నావ్. ఆడది మగాడి అందం చూసి వెంట బడదని నా భావం. మీవారికి నీ అందంముందు ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుంది. నువ్వు తన చేజారిపోకుండా ఇమేజ్ పెంచుకునే యత్నం చేస్తున్నారు" అంది.

అందులో కొంత నిజముంది. అందంలో నేను మావారికి తీసిపోను. కానీ పరిణతి నాకంటే అందగత్తె. ఇమేజ్ పెంచుకునే అవసరం కిషన్‌కి ఉండొచ్చేమో కానీ– మావారికేమిటి?

అదే ఫోన్లో అంటే "నీకు మీ వారి గురించి ఎగో ఎంది. ఎగో మంచిదే కానీ అనుమానం మహా చెడ్డది. అది పెంచుకున్నావీ – భవిష్యత్తుకి మహాప్రమాదం" అంది. ఆ మాటలు హెచ్చరికగా విన్నాను కానీ మనసుకి పట్టించుకోలేదు. ఆ రోజునుంచీ ఆయనపై గట్టి నిఘా వేశాను.

ఒక రోజు సాయంత్రం ఆరింటికి రావల్సిన మనిషి ఎనిమిదైనా రాలేదు. ఆఫీసుకి ఫోను చేస్తే ఆయనకి బదులు స్వప్న తీసింది. సార్ బిజీగా ఉన్నారంది. ఆయన ఫోన్లోకి రాలేదు.

ఒక రోజు మధ్యాహ్నం ఒక్కతినీ షాపింగుకి వెడితే – అక్కడ ఆయన, స్వప్న కనిపించారు. ఆఫీసుకి తెరలు కొంటున్నామన్నారు. స్వప్న అదోలా నవ్వింది.

ఇంటికొచ్చాక నిలదీశాను."దంపతుల మధ్య నమ్మకం అవసరం. నమ్మించడం అనవసరం" అని తేల్చేశారు. బదులుగా, "దాంపత్యానికి నమ్మకం కాదు, నమ్మించడే అవసరం" అన్నాను.

ఆయన చలాంచలేదు. సోఫా దగ్గిరకి వెళ్ళి టీపాయ్ కిందకి వంగి వెదికివెదికి ఓ పేపరు తీశారు. ఓ పేజీ తిప్పి, "ఇది చదువు" అన్నారు. కుతూహలంగా చూశాను.

జెస్సీ జేమ్స్ ప్రముఖ రియాల్టీ టివి స్టార్. హాలివుడ్‌లో ప్రముఖ నటి శాండ్రా బులక్ అతడి భార్య. జేమ్స్ పరస్త్రీ సంపర్కం పెట్టుకోవడంవల్ల వారు విడిపోయారు.

"నేను నా భార్యని మోసం చేశాను. ఐతే, ఏంటి? ఈ ప్రపంచంలో భార్యని మోసం చేస్తున్న మగాళ్లు లక్షల్లో ఉన్నారు. నేనూ వాళ్లలో ఒకణ్ణి- అంతే " అన్నాడు జేమ్స్ తేలికగా.

"అంటే మిమ్మల్ని జేమ్స్ అనుకోవాలా?" అన్నాను కోపంగా.

"నేను నిన్ను జేమ్స్ మోసం చెయ్యలేదు. చేశానన్న అనుమానం నీకుంటే కనుక- మగాళ్లకది సహజమేని సరిపెట్టుకోవడం ఇద్దరికీ మంచిదంటున్నాను'' అన్నారాయన.

ఆయన మాటల్లో ధ్వనించిన నిర్లక్ష్యం నాకు కొత్త. కాస్త లోతుగా ఆలోచిస్తే – ఏ విషయమైనా తెగేదాకా లాగితే నష్టం నాకేనని స్ఫురించింది. ఇప్పుడేం చెయ్యాలి?

నాన్నకి చెబితే ఆవేశపడతారు. అమ్మకి చెబితే సద్దుకుపోమ్మా అంటుంది. అక్కకి చెబితే బావ గురించి గొప్పలు పోతుంది. అన్నయ్యకి చెబితే- ఈ కాలం ఆడపిల్లలకి ఎగో ప్రోబ్లం అంటూ లెక్చర్ మొదలెడతాడు. చిన్న కుటుంబాలొచ్చాక – మనిషికీమనిషికీ మధ్య అవగాహన తగ్గిపోయింది. ఆ స్థానాన్ని అహం, స్వార్థం ఆక్రమించాయి. నాకైతే ఇలాంటి సందర్భాల్లో అయినవాళ్ళకంటే ఎక్కువగా పరిణతి గుర్తొస్తుంది.

పరిణతిది అద్భుత సౌందర్యం. అందానికి మించిన తెలివి. అందుకు దాన్ని చాలాసార్లు నేనేకాదు,మా ఫ్రెండ్స్ చాలామంది మెచ్చుకున్నాం.

"నాకు డబ్బు, హోదా తక్కువ. ఆ లోటుని భర్తీ చేసుకునేందుకు తెలివిని కాస్త ఎక్కువ వాడాలి. మీకా అవసరం లేకా వాడ్డం లేదు కానీ – తెలివి అందరికీ సమంగానే ఉంటుంది" అంది పరిణతి. ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తూ, నోటికొచ్చినట్లు మాట్లాడే వివిధ రంగాల ప్రముఖుల్ని చూసినప్పుడు ఆ మాటలు నిజమేననిపించేది.

ఏదేమైనా ఉన్న తెలివిని వాడడానికి కూడా తెలివి కావాలి. ఆ తెలివి దానికుందన్న నమ్మకంతో – నా సమస్యని మళ్లీ పరిణతికి చెప్పుకున్నాను ఫోన్లో.

"నీలో అభద్రతాభావం ఎక్కువగా ఉంది. అది పోవాలంటే ఉద్యోగంలో చేరు. నీ కాళ్లమీద నువ్వు నిలబడితే- నీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అప్పుడు మీ ఆయనలో అభద్రతాభావం కలగొచ్చు. అప్పుడు జెస్సీ జేమ్స్‌ని వదిలి – శ్రీ రాముణ్ణి ఆదర్శం చేసుకుంటాడు" అంది పరిణతి.

ఆ మాటలతో నాకు కనువిప్పయింది. వెంటనే ఉద్యోగాల వేట మొదలెట్టాను.

బీయస్సీ ప్యాసయ్యాను. బియ్యీడీ చేశాను. కంప్యూటర్ నాలెడ్జి ఉంది. జీతం మరీ ఎక్కువ రాకపోవచ్చు. కానీ – నాకు ఉద్యోగాల కొరత ఏమిటి?

నాలుగు స్కూల్సు నా కోసం పోటీ పడితే ఇంటికి దగ్గర్లో ఓ స్కూలు ఎన్నుకున్నాను. జీతం పది వేలు. ఎటొచ్చీ ఒక వారం రోజులు ఓరియంటేషన్ కోర్స్ తీసుకోవాలి. అందులో సాయంత్రం మూడునుంచి ఆరు దాకా నేను క్లాసులు తీసుకోవాలి. ఆరునుంచి ఎనిమిది దాకా నా క్లాసులపై విశ్లేషణ తెలుసుకోవాలి.

ట్రైనింగ్ సంటర్‌కీ మా ఇంటికీ ముప్పై కిలోమీటర్లు. రాత్రి నన్ను తీసుకొచ్చే బాధ్యత శ్రీవారిదన్నాను. కానీ ఆయనకి నేనుద్యోగం చెయ్యడం ఇష్టం లేదు. ఆ మాట అలా చెప్పలేక, "నాది నెలకి ఎనభైవేల రూపాయల ఉద్యోగం. పదివేల రూపాయల ఉద్యోగికోసం నా ఆఫీసు పనులు సద్దుబాటు చేసుకోవడం బాగుండదు. నీ ఏర్పాట్లు నువ్వు చేసుకో" అన్నారు.

అభద్రతాభావం ఆయనలో అప్పుడే మొదలైందని మనసులో మురిసిపోయాను. ట్రైనింగ్ విషయంలో ఏర్పాట్లు నాకేం కష్టం కాదు. ట్రైనింగ్ సెంటర్‌కీ పరిణతి ఇంటికీ కాలినడక దూరం. ఆ వారం రోజులూ పరిణతి ఇంటికి మారిపోవాలనుకున్నాను.

వద్దన్నా వినననుకున్నారో ఏమో మావారు సరేనన్నారు. వెంటనే పరిణతికి ఫోన్ చేసి, విషయం చెప్పాను. మాటవరసకి చెప్పడం అనుకున్నా కానీ పరిణతి స్పందన ప్రతికూలంగా ఉంటుందని నేనూహించలేదు.

"ప్రస్తుతం నైట్ షిఫ్టులో ఉన్నాను. ఒకటి రెండురోజులైతే ఏమో కానీ – వారం రోజులు నీ కోసం సెలవు పెట్టలేను. నువ్వు వేరే ఏర్పాటు చేసుకోవడం మంచిది" అంది పరిణతి.

తెల్లబోయి, "దాందేముంది? నీ దారిన నువ్వు వెడతావు. నా దారిన నేనొచ్చి పడుకుంటాను. ఇష్టం లేకపోతే మరోలా చెప్పు కానీ కుంటిసాకులు చెప్పకు" అన్నాను నిష్ఠూరంగా.

పరిణతి నవ్వి, "పోనీ కుంటి లేకుండా సాకు చెబుతున్నా విను. కిషన్‌కి స్త్రీ చాపల్యంతో పాటు వశీకరణ శక్తి కూడా ఉంది. నేను లేకుండా రాత్రిళ్లు మా ఇంట్లో పడుకుందుకు నీకభ్యంతరం లేకపోతే నాకు ఓకే" అంది.

ఊహించని ఈ వివరణకి షాక్ తిన్నాను. తమాయించుకున్నాక, "మీవారి ఇమేజ్ బాగానే బిల్డ్ చేస్తున్నావు కానీ- అందుకు నన్ను తక్కువ చెయ్యడం అవసరమా?" అన్నాను.

"చూడు, కిషన్ తత్వానికి నేను అడ్జస్టైపోయాను. నువ్వూ అడ్జస్టైపోగలనని అనుకుంటే – సరే, వెంటనే బయల్దేరి వచ్చేసెయ్" అంది పరిణతి.

నేనేమో – నా భర్త తన కొలీగ్‌తో అఫైర్ పెట్టుకున్నాడేమోనని అనుమానించి –పరిష్కారం వెదుకుతున్నాను. మరి పరిణతి– ఇదేమిటి– మా ఆయన నిన్ను వశపర్చుకునే ప్రమాదముంది. నీకిష్టమైతే నాకు అభ్యంతరం లేదు – అంటుంది?

పరిణతిమీదా, పరిణతి తెలివిమీదా కూడా నాకు నమ్మకముంది. ఆపైన మావారి గ్రీన్ సిగ్నల్ ముందే దొరికింది. దాంతో కుతూహలం సంకోచాన్ని జయించింది.

పరిణతి కాల్ సెంటర్లో పని చేస్తోంది. రాత్రి తొమ్మిదికి కాబ్‌లో వెడుతుంది. ఉదయం ఏడింటికి మళ్లీ కాబ్‌లో ఇంటికొస్తుంది. పనిమనిషి, వంటమనిషి సాయంతో చకచకా భర్తకి కావాల్సినవి అమర్చుతుంది. కిషన్ తొమ్మిదికల్లా వెళ్లిపోతాడు. తను నిద్రపోయి మళ్లీ మూడూ నాలుగు మధ్య నిద్ర లేస్తుంది. పని మనిషి, వంట మనిషి ఐదింటికి వచ్చి ఏడింటికి వెళ్లిపోతారు. కిషన్ ఆరుకీ ఏడుకీ మధ్య ఇల్లు చేరుతాడు.

నేను ఒక రోజు మధ్యాహ్నం నాలుగు ప్రాంతాల పరిణతి ఉండే ప్రాంతం చేరుకున్నాను. సెల్‌లో దారి చెబుతున్న పరిణతి– తన కాంప్లెక్స్ ముందే నాకు స్వాగతం పలికింది. నాలుగో అంతస్తులో ఉన్న వాళ్లింటికి లిఫ్ట్‌లో తీసుకెళ్లింది.

త్రీ బెడ్రూమ్ హౌస్, విశాలంగా ఉంది. డ్రాయింగ్ రూంలో గోడకి బిగించిన పెద్ద ఎల్సీడీ టీ.వి. దానికి కాస్త పక్కన – 15 అంగుళాల ఎల్సీడీ మానిటర్ సైజ్ ఫ్రేమ్‌లో – పరిణతి, కిషన్‌ల ఫోటో ఉంది. చూడగానే దొండపండు, కాకిముక్కు గుర్తొస్తాయి. ఈ సుందరాంగుడా నన్ను వశపర్చుకునేది – అని మనసులో నవ్వుకున్నాను. తన భర్త ఇమేజ్ కోసం అంతలా తాపత్రయపడే పరిణతిని తల్చుకుని జాలిపడ్డాను కూడా.

కాసేపు ఇద్దరం మామూలు కబుర్లు చెప్పుకున్నాం. టైం ఐదు కాగానే పనిమనిషి, వంటమనిషి వచ్చారు. ఇద్దరూ వయసులో ఉన్న యువతులు. అందగత్తెలు కారు కానీ ఆకర్షణీయంగా ఉన్నారు. పరిణతి వారికి నన్ను పరిచయం చేసి – నా కోసం ఓ గది సిద్ధం చెయ్యమని పనిమనిషికి చెప్పింది. నా అభిరుచుల్ని దృష్టిలో ఉంచుకుని వంటామెకి వంట పురమాయించింది.

మరి కాసేపట్లో పనిమనిషి వచ్చి నా గది రెడీ అని చెప్పింది. నేనామెని చూసి తెల్లబోయాను. ఆద్యంతం తెల్లని గౌను ధరించింది. కళ్లు మాత్రం కనిపించేలా – ముఖాన్ని పూర్తిగా కప్పేస్తూ బురఖా.

"ఇది మా ఇంట్లో యూనిఫాం. పనివాళ్లకే కాదు, అతిథులకి కూడా. అవసరమైతే నాక్కూడా" అని నవ్వింది పరిణతి. మిగతా వివరాలు నా గదిలోకి వెళ్లాక చెప్పింది.

సద్దిన పద్ధతి, ఫర్నిచర్, సదుపాయాలు – స్టార్ హోటల్ గదికి దీటు వస్తున్నాయి. ఆ గదిలో మేమిద్దరం ఓ సోఫాలో కూర్చున్నాం.

కిషన్ మంచివాడు. భార్యని ప్రేమిస్తాడు. గౌరవిస్తాడు. ఇంట్లో ఆమెది సమానాధికారం. అతడికున్న బలహీనత పరస్త్రీ. అదీ ఏకాంతంలో ఆమె ముఖం చూసినప్పుడే అతడిలో కాంక్ష పుడుతుంది. ఐతే పొరపాటున కూడా అత్యాచారానికి తలపడడు. కోరిన స్త్రీని తనకి అనుగుణంగా మలచుకోగల వశీకరణ విద్య అతడికి సహజంగా అబ్బింది. తన విషయం అతడు భార్య దగ్గర దాచడు. అలాగని తప్పు చేశానన్న భావం కూడా అతడిలో ఉండదు. పైగైతే ఈ రెండేళ్లలో ఇంటికొచ్చిన ఇద్దరు బంధువులతడికి వశమయ్యారు. ఇద్దరు పనిమనుషులకీ అలాంటి అనుభవం ఎదురైతే- వాళ్లని పనిలోంచి మాన్పించేసింది పరిణతి.

"కొంత స్వానుభవం. కొన్ని చేదు అనుభవాలు. నాకు తరచుగా నైట్ షిఫ్ట్ కాట్టి ఈ సమస్యకి ఇంట్లో పరిష్కారం అవసరం. ఏకాంతంలో ముఖం చూస్తేనే ఆయనలో స్పందనలు. అది గ్రహించేక ఈ బురఖా యూనిఫాం కనిపెట్టాను" అంది పరిణతి.

ఆమె చెప్పింది వింటే నాకో అనుమానం కలిగింది. మందిలో ఉండగా ఎంత అందగత్తెని చూసినా కిషన్ చలించడుట. కానీ ఏకాంతంలో వయసుకత్తె ఐతే చాలు – అతడికి చిత్తచాంచల్యమట. అదీ ముఖం కనపడితేనే. ఈ విషయాన్ని పరిణతి చెప్పిన విధానిబట్టి – పరిణతి కిషన్ బలహీనతని అవగాహన చేసుకుని – పరిష్కారమార్గం ఆలోచిస్తోందేతప్ప – అతణ్ణి ఏవగించుకోవడం లేదు. అది తెలివి అని ఆమె అనుకోవచ్చు– కానీ కిషన్ దాన్నామె అమాయకత్వంగా భావించి అవకాశంగా తీసుకున్నాడేమో! తెలివి పరిణతిదా? కిషన్‌దా?

"పనివాళ్ల విషయంలో రిస్కు లేకుండా ఏ సమయంలోనైనా బురఖా నియమం పెట్టాను. కానీ నువ్వు నేనుండగా బురఖా వాడనక్కర్లేదు. నేను ఆఫీసుకి వెళ్లేముందు వేసుకో. బురఖా లేకుండా ఆయన కళ్లబడకు. నీకే

ప్రమాదమూ ఉండదని నాదీ హామీ” అంది పరిణతి.

ఆరోజు ఆరున్నరకి వచ్చాడు కిషన్. చూడగానే మళ్లీ కాకిముక్తే గుర్తుకొచ్చింది. అతగాడి వశీకరణ ప్రభావంమీద పరిణతికెంత నమ్మకమో! గతంలో ఆమె తెలివికి సర్టిఫికెట్టిచ్చిన వాళ్లలో నేనూ ఉండడం ఆశ్చర్యం!

కిషన్ మితభాషి, కానీ కంపెనీకి బోరు కాదు. ఎదుటివాళు చెప్పేది శ్రద్ధగా వింటాడు. జోక్సుకి నవ్వుతాడు. మధ్యమధ్య వివరణ అడుగుతాడు. ఎదుటివాళ్లు గురువులూ, తాను శిష్యుడూ అనిపించేలా ప్రవర్తిస్తాడు. అమాయకంగా అగుపిస్తాడు. అతడి తీరుతో, అతడి గురించి పరిణతి చెప్పిందాన్ని అంచనా వేసి మనసులో నవ్వుకున్నాడు.

ఎనిమిదింటికల్లా మా భోజనాలయ్యాయి. టైం ఎనిమిదిన్నర కాగానే పరిణతి లేచింది – డ్రెసప్ అవడానికి. నన్నూ డ్రెస్ మార్చుకోమని సైగ చేసింది. నా గదిలోకి వెడితే – మంచంమీద తెల్లటి నైటీ, పక్కనే కళ్ళు మాత్రమే కనబడేలా తెల్లటి బురఖా.

అయిష్టంగానే వేసుకున్నాను.

తొమ్మిదికి కాబ్ వచ్చింది. పరిణతి వెళ్లిపోయింది. కిషన్ తలుపులు మూసి నాకు గుడ్‌నైట్ చెప్పాడు. నేను నా గదిలోకి వెళ్లాను. బురఖా తీసేశాను. మంచంమీద వాలితే కిషన్ గుర్తుకొచ్చాడు. ఏమిటతగాడిలోని విశేషం? పరిణతి చెప్పింది నిజమా?

నిద్ర పట్టడంలేదు. ఏదైనా పుస్తకం ఉంటే బాగుండును – చదువుతూ నిద్రపోవచ్చు.

పుస్తకం కోసమో, కుతూహలమో తెలియదు. జాప్యం చెయ్యలేదు. కిషన్ గదికి వెళ్లాను.

అప్పటికి కిషన్ ఇంకా పడుకోలేదు. సోఫాలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాడు. నన్ను చూసి తలెత్తి ఆశ్చర్యంగా చూశాడు. “ఏదైనా పుస్తకం .. ” అన్నాడు.

అంతే– నేను మాట్లాడింది. ఈ తర్వాతనుంచి అతడొక్కడే మాట్లాడుతున్నాడు. నేను వింటున్నాను. ఆ మితభాషి పెదవుల చాటున అన్ని మాటలెలా దాగాయో నాకు తెలియదు. ఆ మాటలు గోపాలుడి వంశీనాదంలా మనోహరంగా వీనులనీ, మనసునీ తాకుతున్నాయి.

నేను వింటున్నానని అనుకుంటున్నాను. కానీ కిషన్ వశీకరణ శక్తికి మరో నిదర్శనమయ్యాను.

కిషన్ పరిణతి దగ్గిర ఏమీ దాచడన్నది నిజం. మర్నాడుదయం పరిణతి నా భుజం తట్టి , “జరిగింది ఎవరికీ చెప్పకు . నువ్వు కూడా మర్చిపో. ఒకమీదట ఇంట్లో కిషన్ ఉన్నంతసేపూ బురఖా యూనిఫాం నియమాన్ని ఖచ్చితంగా పాటించు..” అంది శాంతంగా.

కిషన్ ప్రవర్తనని సమాజం ఆమోదించదు. ఐనా పరిణతి రహస్యంగా ఆమోదించింది. నేను డ్రెస్ కోడ్ పాటించాను. కిషన్‌కి మాత్రం ఏ నియమాలూ లేవు. ఆశ్చర్యమే!

ఇంటికి తిరిగి వెళ్లాక – తప్పు చేశానన్న భావన ఉందో లేదో చెప్పలేను కానీ – మా వారి అఫైర్ గురించి ఏదైనా ఫోన్‌కాల్ వినాలన్న కాంక్ష మొదలైంది నాలో. ఆశ్చర్యంగా మా దంపతుల మధ్య సామరస్యం కూడా పెరిగింది. కారణం నా ఆర్థిక స్వాతంత్ర్యమో, అపరాధ భావనో తెలియదు.

అదలాగుంచితే – మహిళలపై అత్యాచారాలు తగ్గడానికి – వారికి డ్రెస్ కోడ్ అవసరమన్న వాదన క్రమంగా బలపడుతోంది. స్వానుభవాన్ని బట్టి అది న్యాయమే అనుకుంటున్న సమయంలో – కిషన్‌కి సంబంధించిన మరో కోణం నన్ను సందిగ్ధంలో పడేసింది.

నేనుద్యోగంలో చేరిన రెండు మాసాలకి – తెలిసిన వారింట్లో సత్యనారాయణవ్రతానికి వెళ్లాం నేను, మావారు. అక్కడికి పరిణతి, కిషన్ కూడా వచ్చారు. పరస్పరం పరిచయాలైన కాసేపటికి కిషన్ ఎటో మాయమయ్యాడు.

పూజ సగంలో ఉండగా వంటగది దగ్గిర పెద్దగా కలకలం ఔతుంటే వెళ్లాను. నైవేద్యం పెట్టడానికింకా వ్యవధి ఉంది. తయారైన ప్రసాదాన్ని చిన్న గదిలో ఉంచారుట. కిషన్ ఆ గదిలోకెళ్లి ప్రసాదం రుచి చూసేశాట్ట. ఇప్పుడు ప్రసాదం మళ్లీ తయారు చెయ్యాల్సి ఉంది.

“ఇదేమిటే, మీ ఆయనిలా చేశాడు? ” అంటోంది ఓ పెద్దావిడ పరిణతితో.

“తీపి చూస్తే ఆయనకి చాంచల్యం. అయిందేదో అయింది కానీ పిన్నీ – ఈ సారి ప్రసాదం తయారవగానే పక్కన నలుగుర్ని కాపలా పెట్టండి. లేదా దాన్ని గుడ్డతో కప్పి ఉంచండి..” అంది పరిణతి సంజాయిషీకంటే ఉపాయానికి ప్రాధాన్యమిస్తూ.

నాకు మండిపోయింది. “ఇది బాగుందే – మీ ఆయనకి చిత్తచాంచత్యమని – ప్రపంచమంతా బురఖా వేసుకునుండాలా? ” అన్నాను కోపంగా.

పరిణతి నవ్వి, “గోచిపాతరాయుళ్లు ప్రజలు సొమ్ము దోచేసి ఏడాదిలోనే కోట్లకి పడగలెత్తుతున్నారు. అదేమంటే వ్యాపారంలో ఆర్జించామని బుకాయిస్తున్నారు. వాళ్ల వ్యాపారం బురఖా మాత్రమే అని తెలిసి కూడా– మనమెవ్వరం తప్పనడం లేదు సరి కదా – వాళ్లకి జయజయధ్వానాలు పలుకుతున్నాం. కాస్త కాపలా, తప్పితే ఓ బురఖా. ఈ రెండింట్లో ఏ ఏర్పాటున్నా – మా ఆయన చాంచల్యం తప్పుకి దారి తియ్యదు. తప్పుని కప్పే ఆ బురకాలకంటే, తప్పుని ఆపే నా బురఖా మేలే కాదు, గొప్పది కూడా అని నేననుకుంటాను” అంది గంభీరంగా.

ఇంకేం మాట్లాడతాను? ‘అదీ పరిణతి అంటే..’ అనుకుని ఊరుకున్నాను సగటు భారతపౌరునిలా..

